ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3, కనిష్ఠం 16.9
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 3 జనవరి 2024

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం





- జిల్లాలో పనిచేస్తున్న అధికారుల వివరాలను సేకరిస్తున్న ఎన్నికల కమిషన్
- మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న అధికారుల బదిలీలకు కసరత్తు
- మార్చిలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం

నిజామాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. జిల్లాలో పనిచేస్తున్న అధికారుల వివరాలను సేకరిస్తోంది. దీర్ఘకాలికంగా పనిచేసిన వారి వివరాలను తీసుకోవడంతో పాటు ఎన్నికలకు అవసరమైన బదిలీలకు ఆదేశాలను ఇవ్వనుంది. జిల్లాలో పనిచేస్తున్న వారి వివరాలను పంపించాలని కోరడంతో యంత్రాంగం శాఖల వారీగా సన్నద్ధం చేస్తోంది. శాసనసభ ఎన్నికల సమయంలోనే ఎక్కువ మంది అధికారులు బదిలీ కావడం కొత్తవారు రావడం వల్ల పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లా నుంచి బదిలీ అయ్యే వారు తక్కువగానే ఉన్నా అధికారుల వివరాలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

కేంద్ర ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఆయా రాష్ట్రాల అధికారులతో సమావేశమైంది. కలెక్టర్ కూడా ఢిల్లీకి వెళ్లి వారం రోజుల క్రితం ఎన్నికల కమిషన్ సమావేశంలో పాల్గొన్నారు. షెడ్యూల్‌కు ముందే ఓటర్ల లిస్టు సిద్ధం చేయడంతో పాటు అధికారుల వివరాలను తీసుకుంటున్నారు. జిల్లాలో మూడేళ్లకు పైబడి పనిచేసిన అధికారులను ఎన్నికల సమయంలో బదిలీ చేయనున్నారు. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా నెలరోజుల క్రితమే జిల్లాలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ముందే జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేసిన మండల స్థాయి తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, ఆర్డీవోలు, డీఎస్పీలను బదిలీ చేశారు. ఇతర సీనియర్ అధికారులను కూడా ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు పంపించారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారంతా ఎన్నికల షెడ్యూల్‌కు ముందు మాత్రమే జిల్లాకు వచ్చారు. వీరిలో కొంత మంది పదవీ విరమణ కూడా చేశారు. ఈ వివరాలను అన్నింటిని జిల్లా అధికారులు శాఖల వారీగా ఎన్నికల కమిషన్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరైనా జిల్లాలో శాసనసభ ఎన్నికల ముందు బదిలీ కాకుండా ఎన్నికల విధులకు దూరంగా ఉన్న అధికారుల వివరాలను కూడా పంపించేందుకు సిద్ధమవుతున్నారు.

ముందస్తు ఏర్పాట్లు

పార్లమెంట్ షెడ్యూల్ మార్చి నెలలో వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే ఈ ఏర్పాట్లను ఎన్నికల కమిషన్ చేస్తుండటంతో జిల్లా అధికారులు కూడా ఈ వివరాలను శాఖల వారీగా పంపించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం పలు కార్యక్రమాలు చేపట్టడం, ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుండటం వల్ల అధికారులు వివిధ పనుల్లో నిమగ్నమైన పూర్తిస్థాయిలో నివేదికలను తయారు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి కూడా సమీక్షిస్తుండటంతో ఈ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటరు లిస్టు తయారీలో నిమగ్నమవుతున్నారు. కొత్త ఓటర్లను నమోదు చేయడంతో పాటు ఫిబ్రవరి నెలల్లో పార్లమెంట్ ఎన్నికల కోసం ఫైనల్ లిస్టును ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి.

పార్టీ నేతలతో సమావేశాలు

జిల్లా స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలను నిర్వహిస్తూ ఓటరు నమోదు కార్యక్రమాలను చేపడుతున్నారు. మొత్తంగా అధికారులు ప్రజాపాలన కార్యక్రమాలను చేపడుతూనే కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బదిలీలు అయ్యే అధికారులు తక్కువగా ఉంటారని అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల సమయంలోనే 80 శాతం వరకు రెవెన్యూ, పోలీసు అధికారులు బదిలీపై వచ్చినందున ఎక్కువ మొత్తంలో అవకాశం ఉండదని వారు తెలిపారు. ఏఏ అధికారులు బదిలీ కానున్నారో ఈ నెలాఖరులోగానీ, ఫిబ్రవరి మొదటి వారంలోగానీ తేలే అవకాశం ఉంది.



మచ్చర్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ప్రతీ దరఖాస్తును స్వీకరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, జనవరి2: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందించే ప్రతీ దరఖాస్తును స్వీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని 14వార్డు, మండలంలోని మచ్చర్ల గ్రామంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదు గ్యారెంటీలే కాకుండా ఇతర అంశాలపై వచ్చే దరఖాస్తుల వివరాలను ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు అందజేసే ప్రతీ దరఖాస్తుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. వారు ఏఏ పథకాలకు దరఖాస్తు చేశారనే వివరాల వద్ద రసీదు ఫారంలో టిక్ పెట్టాలని అన్నారు. దరఖాస్తులు స్వీకరణ వద్ద ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. మచ్చర్ల, ఆర్మూర్‌లలో ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని, ప్రజలు ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారే వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, నోడల్ అధికారి జగన్నాథచారి, మచ్చర్ల సర్పంచ్ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ప్రజాప్రతినిదులు, అధికారులు ఉన్నారు.

నందిపేట: అర్హులైన ప్రతీఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఖుద్వాన్‌పూర్, వన్నెల్(కె) గ్రామాల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ, రసీదు అందజేతను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సైతం ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, నోడల్ అధికారి జగన్నాథం, తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీడీవో నాగవర్ధన్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

: జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. మంగళవారం మండలంలోని కేశ్‌పల్లి, మనోహరాబాద్, తొర్లి కొండ, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించారు. కేశ్‌పల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలను జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పరిశీలించారు. తొర్లికొండలో ప్రజాపాలన గ్రామ సభలో ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజలు క్యూ కట్టి దరఖాస్తు చేసుకున్నారు. మనోహరాబాద్, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలలో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మైదం మహేశ్వర్, గంగాధర్, సురేష్ లత, ఎంపీటీసీలు మున్నూరు గంగాధర్, పద్మరాజు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, ఎంపీడీవో బ్రహ్మానందం, తహసీల్దార్ ఎంఎ.ఖాలీం, ఏపీవో యూసుఫ్ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.





- నగరంలోని పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనాల రద్దీ ఇలా..

పెట్రోల్ బంకుల్లో వాహనదారుల బారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: దేశవ్యాప్తంగా బుధవారం నుంచి ఆయిల్ ట్యాంకర్ల సమ్మె నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారులు బారులు తీరారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ ట్యాంకర్లకు ఇస్తున్న కమీషన్‌ను పెంచాలని, చట్టసవరణ విషయంలో గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో బుధవారం నుంచి ఆయిల్ ట్యాంకర్లు దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నారు. కానీ రాష్ట్రంలో ఆయిల్ ట్యాంకర్ల సమ్మెలేదని అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించినప్పటికీ వాహనదారులు సమ్మె వార్తల నేపథ్యంలో పెట్రోల్ బంక్‌ల వద్ద బారులు తీరారు. పెట్రోల్ బంక్‌లు మూసి ఉంటాయనే నేపథ్యంలో రాత్రి వరకు బంక్‌ల వద్ద వేచి ఉండి పెట్రోల్, డీజిల్ ను వాహనాల్లో పోయించుకున్నారు. కొంతమంది బంక్ నిర్వాహకులు ఇదేఅదనుగా భావించి నోస్టాక్ బోర్డులను పెట్టారు.



బోధన్‌లో పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన వాహనదారులు



అధికారులపై సర్కారు నజర్

- గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన పనులపై ఆరా
- అవకతవకలకు పాల్పడ్డ అధికారులపై చర్యలకు సన్నద్ధం

నిజామాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న అధికారులపై ప్రభుత్వం నజర్ పెట్టింది. శాఖల వారీగా వివరాలను సేకరిస్తోంది. దీర్ఘకాలికంగా జిల్లాలో పనిచేస్తున్న అధికారుల వివరాలను తీసుకోవడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన పనులను ఆరా తీస్తున్నారు. వారి ద్వారానే ఆ పనుల లోటు పాట్లను సరిచేయడంతో పాటు ఎక్కువ మొ త్తంలో అవకత వకలకు పాల్పడిన వారిపై చర్య లను చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని శాఖల అధికారుల వివరాలను తీసుకోవడంతో పాటు వారు చేపట్టిన పనులను ఆరా తీస్తున్నారు. ప్రజాపాలన పూర్త యిన తర్వాత శాఖల వారీగా సమీ క్షించి అధికారులను బదిలీ చేయ నున్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజాపాలన ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు మొ దలు పెట్టింది. ఆరు గ్యారెంటీల తో పాటు ఇతర పథకాలు విజయవంతంగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఆయా జిల్లాల పరిధిలో పనిచేసే అధికారులకు అవకాశాలు ఇవ్వడంతో పాటు అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పనిచేసిన శాఖాధిపతులు ఏ విధంగా వ్యవహరించారో ఆరా తీస్తున్నారు. ఏఏ శాఖల అధికారులు అప్పటి ప్రజాప్రతినిధులకు దగ్గరగా ఉండటంతో పాటు ఎలాంటి పనులు చేశారో వివరాలను తీసుకుంటున్నారు. నిబంధనలను దాటి వ్యవహరించిన అధికారులపై దృష్టిసారించడంతో పాటు వారు చేపట్టిన పనులను ఆరా తీస్తున్నారు. ఆ పనుల నివేదికను తీసుకోవడంతో పాటు వారి ద్వారానే సరిచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేసిన రెవెన్యూ, సివిల్ సప్లయిస్, పోలీసు, రవాణా, సాగునీటి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లు, భవనాలు, పంచాయ తీరాజ్, గ్రామాభివృద్ధి, గనులు, భూగర్భ శాఖ, సంక్షేమ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులపై దృష్టి పెట్టారు. ఏ అధికారి జిల్లా స్థాయిలో ఏ విధంగా వ్యవహరించారో ఎన్నేళ్ల నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు, ఏ ప్రతినిధికి దగ్గరగా ఉన్నారో ఆరా తీస్తున్నారు. పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నారు. ప్రాజెక్టుల నుంచి చెక్‌డ్యామ్‌ల వరకు పనుల వివరాలను సేకరిస్తున్నారు.

సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులపై ఆరా

దళితబంధు, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, కొత్త రోడ్ల నిర్మాణం, బ్రిడ్జిలు, భవనాల నిర్మాణం వరకు ఆరా తీస్తున్నారు. ఏఏ పనులకు ఎంత మొత్తం నిధులను కేటాయించారో ఆరా తీస్తున్నారు. ఎంత ఖర్చు చేశారు, చెల్లించవల్సినవి ఎంత ఉన్నాయి, వీటిలో ప్రజాప్రతి నిధుల పాత్ర ఎంత, వారికి అనుకూలంగా ఎంత వరకు అధికారులు వ్యవహరించారో ఆరా తీస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని పనుల అనుమతులను నిలిపివేయడంతో పాటు జిల్లాలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు నజర్ పెట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలో పనుల విషయంలో ఎక్కువగా అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు సన్నద్ధమ వుతున్నట్లు సమాచారం. ఆయా సంస్థల ద్వారా వివ రాలను తీసుకుంటున్న ప్రభుత్వం కొంత మందిని ప్రజాపాలన తర్వాత బదిలీ చేయడంతో పాటు మరికొంత మందిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ఈ చర్యలను చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొంత మంది అధికారులతోనే వారు చేసిన పనులను పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన బిల్లులను మంజూరు చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం బిల్లులను మంజూరు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికుల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసి బిల్లులు సరైన సమయంలో ఇవ్వని మూలంగా కార్మికులు మానసిక ఆందోళనకు గురయ్యారని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ఇప్పటి వరకు కార్మికులకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజన పథకాన్ని సరైన గాడిలో పెట్టి నడిపించాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు జిల్లాలో రూ.15కోట్లకు పైగా ఉన్నాయని వీటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు డ్రెస్‌కోడ్, మౌలిక సదుపాయాలు, ఈఎస్ఐ, పీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

'ప్రజాపాలన'కు దరఖాస్తుల వెల్లువ

- మంగళవారం 89వేల 58 దరఖాస్తులు
- 2లక్షల 85వేల 891కి చేరిన దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరుతో ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మంగళవారం నాలుగో రోజుకు జిల్లా వ్యాప్తంగా 89వేల 58 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 24వేల 807 దరఖాస్తులు రాగా, గ్రామీణ ప్రాంతాల్లో 64వేల 251 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఇతర సమస్యలపై 18వేల 872 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల 85వేల 891 దరఖాస్తులు వచ్చాయి. మరో నాలుగు రోజుల పాటు అధికారులు దరఖాస్తులు స్వీకరించనున్న నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డిటౌన్, జనవరి 2: ట్రాఫిక్ నిబంధనలను వాహనదారుల సౌకర్యం, రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసినవని వాటిని ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని ఎస్పీ సింధూశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చాలామంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలపై ప్రయాణిస్తున్నారని అది చట్టరీత్య నేరమన్నారు. ఇకనైనా తమ వాహనాలకు నంబర్‌ప్లేట్‌లు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలని లేకపోతే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనం నెంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని అసభ్యకరమైన రాతలు, నంబర్ కనిపించకుండా చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. వాహనాలకు నంబర్‌ప్లేట్ పెట్టకపోవడం వలన నేరగాళ్లకు అవకాశం కల్పించిన వారమవుతామని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత కుటుంబ పెద్దలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రిఫిక్ నిబంధనలు పాటించకుండా తప్పించుకునే ప్రయత్నంలో మరిన్ని ఇబ్బందులు తప్పవని, ట్రాఫిక్ పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించకుండా తిరిగేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదుచేయాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రధాన రహదారులతో పాటు, గల్లీలలో కూడా ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు.

పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్పీలు

నిజాంసాగర్, జనవరి 2: బడిబయట పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే చేసి బడిలో చేర్పించినట్లు సీఆర్పీలు తెలిపారు. మండలంలోని మంగ్లూర్ గేటు వద్ద గల ఇటుక బట్టిలో వేరే రాష్ట్రాల నుంచి వలస వచ్చిన విద్యార్థులను గుర్తించి, వారిని పక్క గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో చేర్పించామన్నారు. ఇటుక బట్టిల యజమానులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. నర్సింగ్ రావుపల్లి, మంగ్లూర్, తదితర చోట్ల సర్వే చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యశ్వంత్, సీఆర్పీలు వరలక్ష్మీ, ఐఈ ఆర్పీ చిన్న సాయిలు తదితరులున్నారు.

ముమ్మరంగా ఓటరు నమోదు ప్రక్రియ

భిక్కనూరు, జనవరి 2: ఓటు హక్కు కలిగి ఉండటం ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైంది. రాష్ట్రంలో మరో ఎన్నికల పండుగ రానున్న నేపథ్యంలో కేంద్రం ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమానికి మరో అవకాశం కల్పించింది. ప్రతీ యేటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను ప్రకటిస్తుండగా ఇటీవల ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం పలుమార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి తుది జాబితాను ప్రకటించి దాని ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల సంఘం నిర్వహించింది. మరికొన్ని రోజుల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు, ఎంపీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది.

18ఏళ్లు నిండిన వారికి అవకాశం

ఇప్పటివరకు ఎన్నికల జాబితాలో లేనివారు వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి బీఎల్‌వో వద్ద ఫారం-6 ద్వారా కానీ, సీఈవో వెబ్‌సైట్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం ఫిబ్రవరిలో ప్రకటించే తుది జాబితాలో పేరుంటే రానున్న ఎన్నికల్లో వారు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

జనవరి 5వరకు నమోదుకు ఛాన్స్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20న ప్రారంభమైన ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జనవరి 5 2024వరకు చేపట్టనున్నారు. ఇందుకు బూత్ లెవల్ అధికారులు నూతన దరాఖాస్తులను తీసుకోవడంతో పాటుగా ప్రస్తుతం ఉన్నవారిలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉన్న వారికి అవకాశం కల్పించనున్నారు. జనవరి 5న ఈ కార్యక్రమం పూర్తికాగానే 6న ముసాయిదా జాబితా ప్రకటించి 22వరకు అభ్యంతారాలను స్వీకరిస్తారు. స్వీకరించిన అభ్యంతరాల పరిష్కారానికి బూత్ లెవల్ అధికారులు మరోమారు సర్వే చేపట్టి వాటిని పరిష్కరిస్తారు. ఇందులో భాగంగానే బోగస్ ఓట్లు, మృతుల ఓట్లు తొలగిస్తారు. అనంతరం ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి 8న తుది జాబితాను ప్రకటిస్తారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

:శివప్రసాద్, తహసీల్దార్ (భిక్కనూరు)

జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండినవారు బీఎల్‌వో వద్ద కానీ, సీఈవో వెబ్‌సైట్‌లో కానీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు నమోదు విజయవంతానికి గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది.

ముసుగును తొలగించిన అధికారులు


ముసుగును తొలగించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, జనవరి2: ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించని అధికారులు అని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి అర్గుల్ రాజారాం విగ్రహానికి అధికారులు ముసుగును తొలగించారు. పట్టణంలోని నడిబొడ్డున గల వాటర్ ఫౌంటేన్ వద్ద అర్గుల్ రాజారాం విగ్రహానికి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ముసుగు వేసిన అధికారులు తొలగించడాన్ని మరిచిపోయారు. దీంతో ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ విగ్రహానికి ఉన్న ముసుగు తీయకపోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఎట్టకేలకు ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు స్పందించి ముసుగును తొలగించారు.

ఈసీ అనుమతులను అమలు చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబరు 2: గత పాలక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిని నిలదీశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షలన చేయాలని, రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. అవినీతి చేసిన అధ్యాపకులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో నూతన కోర్సులను అమలు చేయాలని, అధ్యాపకుల పోస్టులను, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.100కోట్ల నిధులు మంజూరు చేయాలని టీయూ అభివృద్ధి పర్చలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివా, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో బారులు తీరిన వాహనదారులు

డొంకేశ్వర్, జనవరి2: పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె పిలుపుతో పెట్రోల్ బంకులు మూడు రోజుల పాటు మూసి ఉంటాయని ప్రచారం జోరుగా సాగడంతో డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లికి వెళ్లే మార్గంలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు బరులు తీరారు. ఇంధనం కోసం ప్రజలు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి వాహనదారులు క్యూలైన్‌లో నిలబడిన పెట్రోల్ పోసుకుని వెళ్లారు.

నవీపేట,జనవరి2: దేశవ్యాప్తంగా ట్రక్కులు, ట్యాంకర్ల డ్రైవర్లు మెరుపు సమ్మెకు దిగడంతో ఇంధన సరఫరా నిలిచిపోయిందనే అనుమానంతో మండల కేంద్రంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద మంగళవారం రాత్రి జనం బారులు తీరారు. పెట్రోల్, డీజిల్ కోసం భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో బంకుల యజమానులు వాహనాలను నియంత్రించడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ తమకు దొరకదేమోనన్న అనుమానంతో జనం అవసరానికి మించి కొనుగోలు చేశారు.

రాజ్యసభ సభ్యుడిని కలిసిన టెలీకాం బోర్డు డైరెక్టర్

డొంకేశ్వర్, జనవరి2: హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు కేఆర్.సురేష్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం డొంకేశ్వర్ మండలానికి చెందిన జిల్లా టెలీకాం బోర్డు డైరెక్టర్ చిన్న దొడ్ల కిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఆర్.సురేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్ , జనవరి2: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని లాలన వృద్ధాశ్రమాన్ని క్షత్రీయ పాఠశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి మాట్లాడుతూ విద్యార్థులు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం హర్షనీయమని ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ప్రేమ, సేవభావం ఏర్పడుతుందన్నారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలలో పాల్గొన్న శాలివాహన దేవాదాయ కమిటీ సభ్యులు

ముప్కాల్, జనవరి2: మండల కేంద్రంలో శాలివాహన దేవాదాయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో రెండు రోజులుగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం 3గంటలకు ఉత్తర పాల్గుణ నక్షత్రయుక్త వృశిక లగ్న పుష్కరాంశ సప్తమి ముహూర్తంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, మహాదాశిర్వవచనం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు


జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

మోర్తాడ్, జనవరి2: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామసర్పంచ్ బద్దం చిన్నారెడ్డి, బద్దం చంద్రశేఖర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, డి.శ్యామ్, నరేంద్ర, గ్రామ కమిటీ సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో ఎస్‌బీఐ ప్రారంభం

ముప్కాల్, జనవరి2: బాల్కొండ మండలం కిసాన్‌నగర గ్రామంలో గల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు ఆధునిక హంగులతో తీర్చిదిద్ది మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి ఈ ప్రాంత ప్రజలకు సేవలందిస్తూ లాభల్లో కొనసాగుతుందని, కస్టమర్ల సౌకర్యార్థం రూ.కోటి వ్యాయంతో కిసాన్‌నగర్ శాఖను ఆధునీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరి లావణ్య వెంకటేష్, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఎంపీటీసీ సభ్యులు నారాయణ, బ్రాంచ్ మేనేజర్ జీ.రాజేష్, కస్టమార్లు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బోధన్ రూరల్, జనవరి 2 : చెందిన అమెరికాలోని అఫ్‌లెంట్ స్టాఫ్ సంస్థ నిర్వాహకుడు, బోధన్‌కు చెందిన పవన్ రాజ్ ఆర్థిక సహకారంతో మండలంలోని చింతకుంట గ్రామంలోని అనాథ ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పంచెలు, నిత్యావసర సరుకులు, పండ్లను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరంలాగే జనవరి 1న సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వ్యాపార వేత్త నరసింహరావు తెలిపారు. కార్యక్రమంలో బాల గంగాధర్, వీరేశం, వార్డెన్ గంగామణి ఉన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవా ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు, నిరుపేదలకు ఉచితంగా బట్టలను, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇందూర్ విద్యా సంస్థల అధినేత కొడాలి కిశోర్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సభ్యులు తదితరులు ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

రెంజల్,జనవరి2: మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో మంగళవారం అయోధ్య రామ మందిరం పూజిత అక్షింతలను రాముల వారి చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భైండ్ల రాజు, గంగాధర్, శంకర్, రాజేందర్, శంకర్, తదితరులున్నారు.

శ్రీరాముడి అక్షింతలకు పూజలు

నవీపేట: మండలంలోని పొతంగల్‌లో మంగళవారం అయోధ్యలోని శ్రీరాముడికి చెందిన అక్షింతలకు పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయ సహిత హనుమాన్ మందిరంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో అక్షింతల కలశానికి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో జరిగిన పూజలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్ రావు, సర్పంచ్ రవీందర్ రావు, యూత్ సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

కరసేవలో పాల్గొన్న వ్యక్తికి అయోధ్య అక్షింతల అందజేత

నిజామాబాద్ అర్బన్: అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం జరిగిన కరసేవలో పాల్గొన్న నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన న్యాలం


పొతంగల్ శివాలయంలో అక్షింతలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


జిల్లా కేంద్రంలో అక్షింతలను అందజేస్తున్న దృశ్యం


వీరన్నగుట్టలో అక్షింతలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆనంద్‌కు మంగళవారం ట్రస్ట్ ప్రతినిధులు అయోధ్య బాల రామ మందిరం అక్షింతలను అందజేశారు. అప్పట్లో అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం నిర్వహించిన కరసేవలో చాలా మంది పాల్గొన్నారు. ఎన్నో ఇబ్బందులు, హింసలు చెలరేగినప్పటికీ రామమందిరం నిర్మాణమే ధ్యేయంగా కరసేవకు వెళ్లిన వారికి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో రామజన్మభూమి ట్రస్టు ప్రతినిధులు స్వామియాదవ్, లక్ష్మణ్, రాము, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబంలో అక్షింతల వితరణ

వర్ని: రుద్రూరు మండలం అంబం గ్రామంలో మంగళవారం గడప గడపకూ అయోధ్య శ్రీరామ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్లేపు గంగాధర్, సాయి ప్రసాద్, మంత్రి లక్ష్మణ్, ఇందూరు నాని, సాయిలు, కుమ్మరి రవి, శానం సాయిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను తప్పుదోవ పట్టించి.. ముప్పుతిప్పలు పెట్టి..

● దుబ్బాక ఐఓబీ బ్యాంకులో చోరీకి దొంగ విఫలయత్నం ● రెండు గంటల తర్వాత దొంగ అరెస్టు

ధర్పల్లి, జనవరి 2 : పోలీసులను తప్పుదోవ పట్టించి.. ముప్పుతిప్పలు పెట్టాడో దొంగ.. బ్యాంకులో చోరీకి యత్నించిన విషయం పోలీసులకు తెలియడంతో.. తనతో పాటు మరో ఎనిమిది మంది దొంగలు ఉన్నారని బుకాయించాడు. చివరకు భారీగా చేరుకున్న పోలీసులు రెండు గంటల తర్వాత షటర్ లోపలికి వెళ్లి చూడగా.. ఒక్కడే ఉండడంతో నివ్వెరపోయిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలోగల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐఓబీ) లో సోమవారం అర్ధరాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. బ్యాంకు ముందు భాగంలో గల షట్టర్‌ను పెకిలించి లోపలికి ప్రవేశించి కొద్దిసేపు బ్యాంకులో తిరుగుతూ స్ట్రాంగ్ రూమ్ వైపునకు వెళ్లాడు. స్ట్రాంగ్‌రూమ్‌ను పగల గొట్టేందుకు యత్నించగా.. బ్యాంకు మేనేజర్‌కు అలారం మోగడంతో అప్రమత్తమయ్యాడు. మేనేజర్ వెంటనే 100కు డయల్ చేయడంతో పాటు దుబ్బాక గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వెంటనే బ్యాంకు వద్దకు చేరుకొని షట్టర్‌ను మూసివేశారు. అంతలోనే ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బయటకు రావాలని దొంగను హెచ్చరించారు. లయితే తనతో పాటు మరో ఎనిమిది మంది దొంగలు ఉన్నారని దొంగ పోలీసులను పక్కదారి పట్టించాడు. రెండు గంటల పాటు బ్యాంకులోనే ఉన్న దొంగ.. పోలీసులను మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. బ్యాంకు లోపల దొంగల ముఠా ఉన్నారని చెప్పడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. దీంతో నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ సహా ధర్పల్లి,


బ్యాంకు వద్ద కాపలా కాస్తున్న గ్రామస్థులు

డిచ్‌పల్లి సీఐలు, పలువురు ఎస్సైలు.. పెద్ద మొత్తంలో తమ సిబ్బందితో హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత బ్యాంకు షట్టర్‌ను తీసి లోపలికి ప్రవేశించారు. అయితే బ్యాంకులో దొంగ ఒక్కడే ఉండడంతో.. పోలీసులు అతన్ని పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోరీకి పాల్పడేందుకు వచ్చిన వ్యక్తి రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. మిగతా దొంగల ముఠా ఎక్కడ అని ప్రశ్నించగా.. ఎవరూ లేరని, తప్పించుకునేందుకే అలా చెప్పానని చెప్పడంతో ఆశ్చర్యపోవడం పోలీసుల వంతైంది. కాగా.. సంతోష్‌రెడ్డిపై గతంలో రెంజల్ పోలీస్ స్టేషన్‌లో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

ఫ్లెక్సీవివాదం ఆలస్యంగా గ్రామసభ

కమ్మర్‌పల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభ మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఫ్లెక్సీవివాదంతో గ్రామసభ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. మండలప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి,ఎంపీపీ లోలం గౌతమి, ఎంపీటీసీ సుధాకర్ అధికారులు గ్రామపంచాయితీవద్ద ప్రజాపాలన గ్రామసభకు సమాయత్తమయ్యారు. అయితే ఫ్లెక్సీపై కేవలం సీఎం ఫొటో మాత్రమే ఉండడంతో బీఆర్‌నాయకులు వ్యతిరేకించారు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకుండా ఎలాప్రారంభిస్తారని వాదనకు దిగారు. దీంతో అక్కడ కొద్దిసేపు గందరగోళపరిస్థితి నెలకొంది. అధికారులు కొత్తఫ్లెక్సీ చేయించి తెప్పించడంతో వివాదం సద్దుమనిగింది. ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు సీఎం, ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా ఎంపి, రాజ్యసభ ఎంపి, జడ్పీచైర్మన్,ఎమ్మెల్సీలు, ఎం పీపీ. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ , కోఆప్షన్ సభ్యుడి ఫొటోలతో ఫ్లెక్సీ తయారు చేయించారు.గ్రామసభ ఆలస్యంగా ప్రారంభమయింది. ప్రజాపాలన కార్యక్రమాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లవద్ద గ్రామస్థులు బారులు తీరి సంక్షేమ పథకాలకై దరఖాస్తులను అధికారులకు అందజేశారు..

పెట్రోల్‌బంక్‌లలో వాహనదారుల బారులు

భిక్కనూరు, జనవరి 2: కేంద్రం తెచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆయిల్ ట్యాంకర్లు ధర్నా చేస్తున్నారని పెట్రోల్‌బంక్‌లు కొన్నిరోజులు బంద్ ఉంటాయన్న ప్రచారంతో భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాలలో ఉన్న పెట్రోల్‌బంక్‌లకు వాహన దారులు మంగళవారం సాయంత్రం నుంచి బారులు తీరారు. ఒక్కసా రిగా పెట్రోల్‌బంక్‌లకు వాహనదారులు పెరగడంతో పెట్రోల్‌బంక్ సిబ్బ ంది ఇబ్బందులు ఎదుర్కోన్నారు. అసత్యపు ప్రచారాలను నమోద్దని పెట్రోల్ బంక్‌ల యాజమానులు చెప్పిన వాహనదారులు పట్టించుకో లేదు. కాగా మండలంలోని కొన్నిపెట్రోల్‌బంకులు నోస్టాక్‌బోర్డులు పెట్టి మూసి వేశారు.

పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటి విడుదల

భిక్కనూరు,జనవరి 2: భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటిని మం గళవారం గ్రామ ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. ముందుగా చెరువు తూముకు, గంగ మ్మకు గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దమల్లారెడ్డి, కంచర్ల సర్పంచ్‌లు లక్ష్మీరాజలింగం, చంద్రకళ మాధవరెడ్డి, విండో చైర్మన్ రాజాగౌడ్ మాట్లాడుతూ పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల పంటల సాగుకై గ్రామ పెద్దచెరువు నుంచి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయాగౌడ్, మంజుల, గ్రామపంచా యతీ పాలకవర్గం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2: కామారెడ్డి జిల్లా కోర్టులో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయాధికారిని ఎస్ఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ న్యాయాధికారిని నాగరాణి, ప్రథమశ్రేణి న్యాయాధికారులు సుధాకర్, బార్‌అసోసియేషన్‌అధ్యక్షుడు శ్రీధర్,జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సం ఘం అధ్యక్షుడు భుజంగరావు,అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్ తదిత రులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీసీసీ ప్రధానకార్యదర్శి

భిక్కనూరు, జనవరి 2: కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌ను పీసీసీ ప్రధానకార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మా నించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సంకల్ప వికసిత్ భారత్

వర్ని,జనవరి2: రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రసాభాసగా మారింది. కార్యక్రమం నిర్వహణ గురించి ఎంపీడీవో, కార్యదర్శి ముందుగా చాటింపు ఇవ్వకపోవడంతో ప్రజలు రాక బోసిపోవడంతో బీజేపీ శ్రేణులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం పక్కనే ప్రజా పాలన దరఖాస్తుల సమర్పణకు వందల సంఖ్యలో బారులు తీరారు. దీంతో అదే ప్రాంతంలో ఎల్ఈడీ ఏర్పాటు చేయగా ప్రజలు కార్యక్రమం వీక్షణకు దూరంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్ జరిగిన పొరపాటును గమనించి ఆందోళనకారులకు నచ్చజెప్పి సముదాయించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని గంట సేపు నిలిపివేయించి కార్యక్రమం నిర్వహణకు కృషి చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.


పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రారంభోత్సవానికి సిద్ధంగా జక్రాన్‌పల్లి పాఠశాల భవనం

● రేపు మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ● పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పైపుల రాజారెడ్డి


ప్రారంభోత్సవానికి సిద్దంగా ఉన్న పాఠశాల భవనం


మాట్లాడుతున్న పైపుల రాజారెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి2: జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నట్లు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ప్రధాన దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త పైపుల రాజారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల భవనం, తరగతి గదుల ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర నర్సింహతో పాటు ఎంపీలు ధర్మపురి అర్వింద్, సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపసర్పంచ్ బాలకిషన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, డాక్టర్ సుబాష్, ఉమ మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యం కల్పించేందుకు గత ఏడాది ప్రాముఖ పారిశ్రామికవేత్త దాత పైపుల రాజారెడ్డి ముందుకు వచ్చారు. ఈ పాఠశాలలో 2023 ఫిబ్రవరి 3న ఈ పాఠశాలలో రూ.50లక్షల పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎందరో దాతలు ముందుకు వచ్చి పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి విరాళాలు అందజేశారు. మొదట రాజారెడ్డి తనవంతు రూ.75లక్షలతో పాఠశాల భవనం, తరగతి గదుల పనులను నిర్మించారు. ఆయన కుటుంబసభ్యులు తరగతి గదుల నిర్మాణానికి రూ.కోటి నగదును అందజేశారు. పలువురు దాతలు విరాళాలు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. సుమారు రూ.3కోట్లతో ఈ పాఠశాల భవనం 20 తరగతి గదులు, తొమ్మిది మడిగెలు, వంట శాల గదులు, నిర్మించి పూర్తి చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

రెంజల్,జనవరి2: మండలంలోని దూపల్లి గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దూపల్లి గ్రామ శివారులో ఇసుకను ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది గంగాధర్, శంకర్ రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, పవన్ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,జనవరి2: మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్(47)అనే వ్యక్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్ డిసెంబరు 31నఇంట్లో భార్యతో గొడవ పడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శంకర్ క్షణికావేశంలో తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య స్థానికుల సహాయంతో శంకర్‌ను 108అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శంకర్ మంగళవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. శంకర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారని, అతడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

మోపాల్,జనవరి 2: గత 15 రోజుల క్రితం గాలిపటం కోసం చెట్టు ఎక్కికిందపడిన కేతావత్ బంటు (13) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన కేతావత్ బంటు గాలిపటం ఎగరవేస్తుండగా చెట్టుకు తగలడంతో చెట్టుఎక్కడంతో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

అదృశ్యమైన యువకుడు శవమై కనిపించాడు

మోర్తాడ్, జనవరి2: మోర్తాడ్‌లో ఐదు రోజుల క్రితం అదృశ్యమైన అడే అజయ్(25)అనే యువకుడు మంగళవారం ఉదయం వరద కాలువలో శవమై కనిపించాడని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలం కోడర్నా గ్రామానికి చెందిన అడేఅజయ్ బతుకుదెరువు కోసం మోర్తాడ్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తుండేవాడని ఎస్సై తెలిపారు. కాగాఆసుపత్రి వారికి ఇద్దరి మధ్య వివాదాలు రావడంతో ఆయన సొంతంగా ల్యాబ్ పరీక్షలు చేయడానికి పెట్టుకున్నాడని ఎస్సై తెలిపారు. ఇట్టి ఆసుపత్రి వారికి చెల్లించాల్సిన డబ్బులపై ఒత్తిడి చేయడంతో మనసికంగా కుంగిపోయి వరదకాలువలో పడిఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సైతెలిపారు.కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వఆసుపత్రికి పంపి కేసునమోదు చేస్తున్నామ న్నారు.

● కుటుంబ సభ్యుల ఆందోళన

మృతుడు అజయ్ కుటుంబసభ్యులు తరలివచ్చి ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఆసుపత్రి వర్గాలు తన కుమారుడిపై వేధింపులకు గురి చేయడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నాని ఆరోపిస్తూ ధర్నా చేశారు. పోలీసులు కుటుంబసభ్యులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విమరించారు. అనంతరం పోస్టు మార్టం అనంతరం శవాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటి విడుదల

భిక్కనూరు,జనవరి 2: భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటిని మం గళవారం గ్రామ ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. ముందుగా చెరువు తూముకు, గంగ మ్మకు గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరంపెద్దమల్లారెడ్డి, కంచర్ల సర్పంచ్‌లు లక్ష్మీరాజలింగం, చంద్రకళ మాధవరెడ్డి, విండో చైర్మన్ రాజాగౌడ్ మాట్లాడుతూ పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల పంటల సాగుకై గ్రామ పెద్దచెరువు నుంచి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయాగౌడ్, మంజుల, గ్రామపంచా యతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

సుభాష్‌నగర్, జనవరి 2: అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నారని కార్పొరేటర్‌పై నవీన్‌రెడ్డి అనే వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిని నిర్మిస్తున్నాడని ఇన్‌వార్డులో వినతిపత్రం అందజేశారు. ఇంటికి అనుమతి తీసుకోకపోవడమే కాకుండా నిర్మాణం కోసం ఉపయోగిస్తున్న సిమెంట్, దుమ్ము, దూళి రావడం వల్ల ఆరోగ్యం చెడిపోతుందని తెలిపారు. కనీసం ఎలాంటి అడ్డు పెట్టకుండా నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

భిక్కనూరు, జనవరి 2: మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండలంలోని బస్వాపూర్ బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత కొన్నిరోజుల క్రితం తొలివెలుగు యూట్యూబ్ ఛానెల్‌లో బస్వాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అక్రమంగా 500ల వికలాంగుల పింఛన్లను ఇప్పించారని అసత్యపు వార్తలను ప్రచారం చేశారని, ఎలాంటి నిజనిజాలను తెలుసుకోకుండా అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. గ్రామంలో మొత్తంగా 88వికలాంగుల పింఛన్లు మాత్రమే ఉన్నాయని సదరు యూట్యూబ్ ఛానెల్ ప్రతినిధులు బస్వాపూర్ గ్రామానికి గానీ, ఎంపీడీవో కార్యాలయానికి గానీ వెళ్లి విచారణ చేసుకో వచ్చు నని అన్నారు. వెంటనే ఆ యూట్యూబ్ ఛానెల్ యాజమాన్యం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పిలని లేని యెడల యూట్యూబ్ ఛానెల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుర్రి గోపాల్, మల్లారెడ్డి, మల్లేషం, మద్ది స్వామి, సిద్ధరాములు, భిక్షపతి, మల్లేశం, బాలాగౌడ్, రాజి రెడ్డి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


బస్వాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రజాపాలన సభలో ప్రతీ దరఖాస్తును స్వీకరించాలి

● అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

బోధన్ రూరల్, జనవరి 2 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన సభలలో ప్రతి దరఖాస్తును అధికారులు స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 19, 21, 23 వార్డులలోని సభలను ఆమె పర్యవేక్షించారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలు ఇచ్చిన ప్రతీ దరఖాస్తును తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ప్రజల దరఖాస్తు ఫారాలను నింపి సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరించాలన్నారు. ఇప్పటి వరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డు లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. దరఖాస్తు ఫారాల కోసం ప్రజలు ఇబ్బందులు పడవద్దని ఎవరైనా దరఖాస్తు ఫారాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, సీఐ వీరయ్య, ఏఈ శివకృష్ణ, మేనేజర్ నరేంద్ర, కౌన్సిలర్లు మీన్ నజీర్ అలీ, శరత్‌రెడ్డి, ఆది ఉన్నారు.

రెంజల్: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రజా పాలన సభలో ప్రతి ఒక్కరి దరఖాస్తును తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎండలో లబ్ధిదారులు వచ్చి దరఖాస్తులను అందజేయడంపై స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటర్ల వద్ద టెంట్‌లను ఏర్పాటు చేసి రికార్డులో తేదీల వారీగా దరఖాస్తులు నమోదు చేయాలని సిబ్బందిని సూచించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. దూపల్లి, బోర్గాం, కళ్యాపూర్ గ్రామాలలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)యాదిరెడ్డి ప్రజా పాలనలో పాల్గొన్నారు. ప్రజలకు అందించే గ్యారంటీ పథకాలపై అవగాహన తీరును తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే లబ్ధిని పొందాలన్నారు. వారి వెంట జేడీఏ వాజీద్ హుస్సేన్, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో శంకర్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్ఐ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి, వైద్య అధికారి వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సర్పంచ్‌లు సాయరెడ్డి, వికార్ పాషా, కాశం నిరంజని, వెల్మల సునీత నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మొబిన్ ఖాన్, రెంజల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిరెడ్డి, సురేష్ పటేల్, నర్సయ్య, ఎంఎల్ రాజు, కార్తీక్, తదితరులున్నారు.



సాటాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

ఎడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని జానకంపేట గ్రామంలో ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రశీదులను అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీసింగ్, ఎంపీవో సుభాష్ చంద్రబోస్ ఉన్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలనకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని మోకన్‌పల్లి, మహంతం, శివతండా, హనుమాన్ ఫారం, గాంధీనగర్, మద్దెపల్లిలలో ఈ గ్రామసభలు నిర్వహించారు. మహంతంలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కోటగిరి: ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. కోటగిరి మండలం సుద్దులం తండా, పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారం గ్రామాలలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పలు పథకాల కింద పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ప్రభాకర్, ఎంపీవో మారుతీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



జానకంపేటలో ప్రజాపాలనను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

ఆర్మూర్‌రూరల్ : మండలంలోని దేగాం, ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్‌లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గడ్డం సరోజ, కల్లెం మోహన్, ఉపసర్పంచ్‌లు గడ్డం గంగారెడ్డి, దుమ్మజి శ్రీనివాస్, తహసీల్దార్ నరేష్, అధికారులు లక్కం ప్రభాకర్, లక్ష్మీ, గంగారాం పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : ప్రజాపాలన దఖాస్తులు స్వీకరణ కేంద్రాన్ని మంగళవారం డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్పూర్ గ్రామాలలో నిర్వహించారు. మండల స్పెషల్ అధికారిగా రసూల్‌బీ, టీం లీడర్‌గా రాములు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై రాహుల్, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, ఏవో జోష్న భవాని, ఎంపీటీసీ సంజీవ్, బీసీసెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, సుద్ద చిన్నయ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : ఆరు గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణల నేపథ్యంలో ప్రజాపాలనలో అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం బాల్కొండలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఎంపీడీవో సంతోష్, తహసీల్దార్, శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు స్వీకరిస్తున్నారు.

డిచ్‌పల్లి: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం తీసుకుంటున్న దరఖాస్తు ఫారాలను ముందస్తుగా ఉచితంగా అందజేయాలని, ఎక్కడ కూడా జిరాక్స్ పత్రాలు రాకుండా చూసుకోవాలని, ఆన్‌లైన్ షాపుల్లో జిరాక్స్‌ల పేరుతో ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డీపీవో జయసుధ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన సదస్సును ఆమె పరిశీలించారు.

ధన్‌పాల్‌ను సన్మానించిన జేపీ నడ్డా



ధన్‌పాల్‌ను సన్మానిస్తున్న జేపీ నడ్డా

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం ఢిల్లీలో సన్మానించారు. అయోధ్య రామమందిర సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ధన్‌పాల్ జేపీ నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ధన్ పాల్‌ను ఆయన సన్మానించడంతో పాటు పార్టీ ఆదేశాల మేరకు నిర్వ హించే ప్రతి కార్యక్రమంలో పాల్గొని పార్టీని బలోపేతం చేయాలన్నారు.

యూనిఫామ్‌లు కుట్టేందుకు సీల్డ్ కొటేషన్ల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లాలోని ఇందల్వాయిలోగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కో-ఎడ్యుకేషన్ పాఠశాలల్లో బాలుర, బాలికల యూనిఫామ్‌లు కుట్టేందుకు ఆసక్తిగల దర్జీల నుంచి సీల్డ్ కొటే షన్లు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు లేదా సంస్థలు ఈనెల 8లోగా ఇందల్వా యిలోని ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు సీల్డ్ కొటేషన్లు సమర్పిం చాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా యూనిఫామ్‌లు కుట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. వివరాలకు 8501913274 ఇందల్వాయి ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: 2023-24 విద్యాసంవత్సరానికి గాను వివిధ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రిన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాల కోసం గడువును ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పొడగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

రెంజల్,జనవరి2: మండలంలోని కళ్యాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి తనిఖీ చేశారు. కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి చిన్నారులకు అందించే పౌష్టికాహార విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శ్రేష్ఠమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

జిల్లా జడ్జికి శుభాకాంక్షలు తెలిపిన సీపీ



జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ

ఖిల్లా, జనవరి 2: నూతన సంవత్సరం సందర్భంగా సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ మంగళవారం జిల్లా జడ్జి సునీత కుంచాలను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కోర్టు కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ లా అండ్ ఆర్డర్ ఎస్. జయరాంతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పోలీసు కార్యాలయంలో సీపీని అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ జయరాం, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏఆర్) గిరిరాజ్, ఏవో శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ టీఎస్ శ్రావణ్‌కుమార్, నిజామాబాద్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీ ఏసీపీలు కిరణ్‌కుమార్, నారాయణ, రాజశేఖర్‌రాజు, ఏ.రవీందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం సిబ్బంది, ఐటీకోర్ సిబ్బంది తదితరులు సీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన డీఈవో



అదనపు కలెక్టర్‌ను కలిసిన డీఈవో, సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, జనవరి 2: నూతన సంవత్సరం సందర్భంగా అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి డీఈవో దుర్గా ప్రసాద్, కార్యాలయ సిబ్బంది మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాశాఖ సిబ్బంది అదనపు కలెక్టర్‌కు నోట్ పుస్తకాలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఏడీ నాగజ్యోతి, ఏసీ విజయ్‌భాస్కర్, తూల రవీందర్, వనిత, నాగేశ్వర్‌రావు, శంకర్, శ్రీనివాస్‌రావు, శివ, సిబ్బంది ఉన్నారు.

మండవని కలిసిన కాంగ్రెస్ ప్రతినిధులు

డిచ్‌పల్లి, జనవరి 2: కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావును డీసీసీ డెలిగెట్ వాసుబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రతినిధులు మంగళవారం కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మురళి,దేవిదు, బాబు, మైఖేల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డు కోసం దరఖాస్తు ఫారం రాలేదు'

డొంకేశ్వర్, జనవరి2: ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే ప్రజలు ప్రభుత్వం నుంచి ఎటువంటి దరఖాస్తు ఫారాలు రాలేదని ఎవరూ కూడా మీ సేవ జిరాక్స్ సెంటర్‌లో డబ్బులు ఖర్చు చేసి కొనుగోలు చేయవద్దని డొంకేశ్వర మండలం తహసీల్దార్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు అవసరం ఉన్న లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న దానికి ఒక్క తెల్ల కాగితంపై రేషన్‌కార్డు అవసరం ఉందని ప్రజాపాలన దరఖాస్తులకు జత చేస్తే సరిపోతుందన్నారు. దరఖాస్తు ఫారాలను మీ సేవ జిరాక్స్ సెంటర్‌లో అధిక ధరలకు విక్రయిస్తే సెంటర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని ఆయన హెచ్చరించారు.

'కాంగ్రెస్ కార్యకర్తను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

కోటగిరి,జనవరి2: నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో సాదుల రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తను హత్య చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొట్టం మనోహర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాటలు పెట్టడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ కార్యకర్తలు వ్యక్తిని దారుణంగా కొట్టి హత్య చేయడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. ఈ హత్య వెనుక అసలు సూత్రధారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కాసుల బాల్‌రాజ్ అండగా నిలిచారని గుర్తు చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు షాహీద్, సీనియర్ నాయకులు గంగాధర్ రావు దేశ్‌ముఖ్, నాయకులు అయుబ్, భూమయ్య, అనంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ప్రభుత్వ భూమి పరిశీలన

ఆర్మూర్‌రూరల్, జనవరి2: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మున్సిపల్‌కు చెందిన పది శాతం ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్‌కు చెందిన పది శాతం ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణల మేరకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని చదును చేసి హద్దులు ఏర్పాటు చేయాలని, కబ్జాకు గురి కాకుండా చూడాలని కమిషనర్‌కు సూచించారు. అనుమతి తీసుకోకుండా నిర్మిస్తున్న నివాస గృహాల విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారి హరీష్‌ను ప్రశ్నించగా తనకు తెలియదని పరిశీలిస్తానని సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ ఎలాంటి నిర్మాణాలు జరిగిన టౌన్‌ప్లానింగ్ అధికారికి కచ్చితంగా తెలుసుండాలని అన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిరాయత్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేయిస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు జీవీ.నర్సింహారెడ్డి, కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్, కౌన్సిలర్ పాలెపు రాజు, ఆకుల శ్రీనివాస్, దొండి ప్రకాష్, గడ్డం సంజీవ్, కొట్టాల సుమన్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని పరిరక్షించాలి

నవీపేట,జనవరి2: నవీపేటలోని ప్రభుత్వ సామాజిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని వెంటనే ఆసుపత్రికి సంబంధించిన స్థలాన్ని పరిరక్షించాలని ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీలో తీర్మానించారు. మంగళవారం ఆసుపత్రిలో సలహా కమిటీ చైర్మన్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించి గతంలో 5.10ఎకరాల భూమి ఉండగా రికార్డులలో 4.19ఎకరాల భూమి ఉందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఇటీవల ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, ఈ విషయాన్ని గతంలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆసుపత్రి స్థలం కబ్జా కాకుండా వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వీడీసీ సభ్యుల ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కలిసి వివరించాలని సభ్యులు పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరు కాగా ప్రస్తుతం రూ.1.10లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని వీటిని ఆసుపత్రిలో అత్యవసర సేవలకు వినియోగించాలని వైద్యాధికారులకు ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనా, డీడీవో తుకారాం రాథోడ్, మెడికల్ ఆఫీసర్ కావ్య, ఎంపీటీసీలు రాధ, మీనా, సతీష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్ రావు, కిషన్ తదితరులున్నారు.



నవీపేట సీహెచ్‌సీలో సమావేశమైన అభివృద్ధి సలహా కమిటీ